సాక్షి రంగారెడ్డి

గురువారం । 26 । అక్టోబర్ । 2023



మేం ఓటెయ్యం

ఓటు అనే రెండక్షరాలకు ప్రపంచ గతిని మార్చేశక్తి ఉంది. ఓటు.. వ్యవస్థ మార్పునకు నాంది పలుకుతుంది.

10లో▸



కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మద్యం, డబ్బును తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ దేవకి హెచ్చరించారు.

10లో▸



ఎదురెదురుగా లారీలు ఢీ

నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై బుధవారం రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు.

10లో▸

న్యూస్‌రీల్

ఈవీఎం.. ఆగయా



సీవీఆర్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎం బాక్స్‌లు

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సంబంధించి బుధవారం ఈవీఎం బాక్సాలు పోచారం సమీపంలోని సీవీఆర్ కళాశాలకు చేరుకున్నాయి. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 319 పోలింగ్ కేంద్రాలకు గాను 396 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, 446 వీవీపీఏటీలు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ అనంతరెడ్డి తెలిపారు. సీవీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఈ యంత్రాలను భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ కేంద్రాల కంటే అదనంగా మెషీన్లు, వీవీపీఏటీలు వచ్చినట్లు వెల్లడించారు. నవంబర్ 30న జరిగే పోలింగ్‌కు సీవీఆర్ కళాశాల నుంచి ఈవీఎంలను, సిబ్బందిని పంపుతామని.. తిరిగి పోలింగ్ అనంతరం ఇక్కడే ఈవీఎంలను భద్రపరుస్తామన్నారు. ఎన్నికల కౌటింగ్ కూడా ఈ కళాశాలలోనే జరుగుతుందని ఆయన వెల్లడిఇంచారు.

కటింగ్ చేస్తా.. ఓటు పట్టేస్తా



కటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

మొయినాబాద్: చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య బుధవారం మొయినాబాద్‌లో వినూత్న ప్రచారం చేపట్టారు. వీరన్నపేటలోని ఓ హెయిర్ సెలూన్‌లో కత్తెర పట్టి కటింగ్ చేశారు. అన్నా నీ ఓటు నాకే వేయాలి అని అభ్యర్థించారు. అనంతరం ఓ హోటల్లో పూరీలు దేవారు. వృద్ధులతో ఫించన్ అందుతుందా అని ఆప్యాయంగా మాట్లాడారు. పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.


ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి: ఏసీపీ



సీఐఎస్‌ఎఫ్ బలగాల కవాతులో పాల్గొన్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

చేవెళ్ల: అసెంబ్లీ ఎన్నికలను ప్రజలు ప్రశాంతవాతవారణంలో జరుపుకోవాలని చేవెళ్ల ఏసీపీ పి.ప్రశాంత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండలం ఆలూరులో బధవారం రాత్రి సీఐఎస్‌ఎఫ్ బృందంతో కలిసి ఆయన కవాతు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. ప్రశాంత ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొనాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా కఠిన చర్యలు తప్పవన్నారు. కవాతుతో సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపునకు అవకాశం ఉంటుందన్నారు. పార్టీలన్నీ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు లక్ష్మారెడ్డి, యాదయ్య, రంగా, ఎస్‌ఐలు వీరబ్రహ్మం, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అగ్రతాంబూలమే..



జంగ్ తెలంగాణ

రాజకీయాల్లో ఉమ్మడి జిల్లా నేతలకు ప్రత్యేక గుర్తింపు

- ప్రతి కేబినెట్‌లోనూ మంత్రి పదవులు
- ఇద్దరు సీఎంలు, ముగ్గురు హోంమినిస్టర్లు మనవారే
- తొలి మహిళా హోంమంత్రిగా రికార్డులకెక్కిన సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాజకీయాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. అనేకమంది ఉద్దండులకు నిలయంగా ఈ జిల్లా నిలిచింది. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు షాద్‌నగర్ (ఒకప్పుడు మహబూబ్ నగర్ జిల్లా, ఇప్పుడు రంగారెడ్డి జిల్లాలో భాగం) నియోజకవర్గం నుంచే గెలుపొందారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి కూడా ఉమ్మడి జిల్లాలోని వికారాబాద్ నుంచి ఒకసారి, మేడ్చల్ నుంచి మరోసారి గెలుపొందారు. కేంద్రమంత్రిగా పనిచేసిన దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి కూడా ప్రస్తుత రంగారెడ్డి జిల్లా పరిధిలోని కల్వకుర్తి నియోజకవర్గం నుంచి 4 సార్లు గెలుపొందారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం ఎన్‌టీఆర్ తొలిసారిగా ఓటమిని చవిచూసింది ఇక్కడే. ఆయనపై గెలుపొందిన చిత్తరంజన్‌దాస్ చెన్నారెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు.

షాద్‌నగర్ నియోజకవర్గం..

షాద్‌నగర్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. 11 మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. 1952లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, కేరళ గవర్నర్‌గా పనిచేశారు. ఇక్కడి నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ పి.శంకర్‌రావు గతంలో కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. అలాగే 2009లో కంటోన్మెంట్ నుంచి గెలుపొంది కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు.

మేడ్చల్ నియోజకవర్గం..

మేడ్చల్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 14 సార్లు ఎన్నికలు నిర్వహించగా పది మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. వీరిలో ఒకరు ముఖ్యమంత్రిగా.. మరో ఐదుగురు మంత్రులుగా పనిచేశారు. వీరిలో సుమిత్రాదేవి (1967–72) జిల్లా నుంచి తొలి మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత మర్రిచెన్నారెడ్డి 1978లో కాంగ్రెస్ నుంచి గెలుపొంది ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన మొత్తం ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. వికారాబాద్, తాండూరు నుంచి రెండేసి సార్లు, సనత్‌నగర్ నుంచి ఒకసారి, మేడ్చల్ నుంచి ఒకసారి విజయం సాధించారు. ఆ తర్వాత ఉమా వెంకట్రామిరెడ్డి(1983, 1989) కాంగ్రెస్ నుంచి, సురేందర్‌రెడ్డి(1985) టీడీపీ నుంచి పోటీచేసి గెలుపొందడమే కాకుండా ఆయా ప్రభుత్వాల్లో మంత్రులుగా పనిచేశారు. ఆ తర్వాత 1994 నుంచి 2004 వరకు టీడీపీ నుంచి వరుసగా మూడుసార్లు తూళ్ల దేవేందర్‌గౌడ్ గెలుపొందారు. ఆయన హోం, రెవెన్యూశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుత కార్మికశాఖ మంత్రిగా కొనసాగుతున్న మల్లారెడ్డి సైతం మేడ్చల్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు.

చేవెళ్ల నియోజకవర్గం..

చేవెళ్ల నియోజకవర్గానికి 1962 నుంచి ఇప్పటివరకు 14సార్లు ఎన్నికలు నిర్వహించగా తొమ్మిది మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వీరిలో 1985 నుంచి వరుసగా నాలుగు సార్లు (టీడీపీ నుంచి మూడు, కాంగ్రెస్ నుంచి ఒకసారి) గెలుపొందిన పి.ఇంద్రారెడ్డి ఉమ్మడి ఏపీలోని ఎన్‌టీఆర్ కేబినెట్‌లో హోంశాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన అకాల మరణం తర్వాత ఆ స్థానానికి (2000) నిర్వహించిన ఉపఎన్నికల్లో ఆయన సతీమణి సబితారెడ్డి గెలుపొందారు. ఆమె 2004లో కాంగ్రెస్ నుంచి మళ్లీ విజయం సాధించి తొలి మహిళా హోంమంత్రి(దేశంలోనే తొలి మహిళా హోంమంత్రి)గా పనిచేశారు. దంపతులిద్దరూ ఒకే నియోజకవర్గం నుంచి గెలుపొందడమే కాకుండా ఒకే శాఖకు మంత్రిగా పనిచేయడం విశేషం. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మహేశ్వరం నియోజకవర్గం నుంచి గెలుపొందిన సబితారెడ్డి గనులు భూగర్భవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు.2018లో అదేస్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి.. ఆ తర్వాత అధికార బీఆర్‌ఎస్‌లో చేరి విద్యాశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి కాలె యాదయ్య(బీఆర్‌ఎస్) ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

పరిగి నియోజకవర్గం..

పరిగి నియోజకవర్గానికి ఇప్పటివరకు 15సార్లు ఎన్నికలు జరిగగా.. 12 మంది రెడ్డి సామాజికవర్గం వారే విజయం సాధించారు. మూడుసార్లు మైనార్టీ(ముస్లిం) అభ్యర్థులు గెలుపొందారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా కమతం రామిరెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 1972, 1989లో ఆయనే కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. జలగం వెంగళ్‌రావు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్లో.. కమతం రాంరెడ్డి వివిధ శాఖలకు మంత్రిగా పనిచేశారు. 1978, 1983లో పరిగిలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన ఎ.షరీఫ్ చెన్నారెడ్డి, టంగుటూరి అంజయ్య కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీ నుంచి ఐదుసార్లు(1985, 1994, 1999, 2004, 2009) గెలుపొందిన హరీశ్వర్‌రెడ్డి డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన కొడుకు కొప్పుల మహేశ్‌రెడ్డి పరిగి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

వికారాబాద్, తాండూర్‌లో..

వికారాబాద్‌లో ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు నిర్వహించగా ఎనిమిది మంది ఎమ్మెల్యేగా పనిచేశారు. చంద్రశేఖర్ కొంతకాలం చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేయగా, గడ్డం ప్రసాద్ కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు. ఇక్కడ నుంచి గెలుపొందిన రామస్వామి కూడా మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి ఏపీ సీఎంగా పనిచేసిన మర్రిచెన్నారెడ్డి కూడా ఇదే నియోజకవర్గం నుంచి రెండుసార్లు గెలుపొందారు. తాండూరుకి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. ఏడుగురు ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వీరిలో మాణిక్య రావు, మర్రి చెన్నారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి పైలెట్ రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు నిర్వహించగా.. 11 మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వీరిలో 1957–67 వరకు ఎమ్మెల్యేగా కొనసాగిన ఎంఎన్ లక్ష్మీనర్సయ్య సహా 1978లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన సుమిత్రాదేవి, 1999లో టీడీపీ నుంచి గెలుపొందిన కొండ్రు పుష్పలీల మంత్రులుగా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి(బీఆర్‌ఎస్) ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

తొలి మహిళా హోంమంత్రిగా సబితారెడ్డి

అలాగే చేవెళ్ల నుంచి గెలుపొందిన పటోళ్ల ఇంద్రారెడ్డి, సబితారెడ్డి దంపతులిద్దరూ ఉమ్మడి ఏపీలో హోంమంత్రులుగా పనిచేశారు. అయితే దివంగత నేత, మాజీ సీఎం డా.వైఎస్సార్ క్యాబినేట్‌లో దేశంలోనే తొలి మహిళా హోంమంత్రిగా సబితారెడ్డి రికార్డులకెక్కారు. ఇదే జిల్లాకు చెందిన తూళ్ల దేవేందర్‌గౌడ్ సైతం ఉమ్మడి ఏపీలో హోంమంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం మహేశ్వరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సబితారెడ్డి విద్యాశాఖ మంత్రిగా, మేడ్చల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న చామకూర మల్లారెడ్డి కార్మికశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 17 నియోజకవర్గాలు ఉండగా.. వీటిలో 10 స్థానాల్లోని అభ్యర్థులకు ఇప్పటివరకు ఆయా మంత్రివర్గాల్లో అవకాశం లభించింది. అయితే రాజేంద్రనగర్, ఎల్బీనగర్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేర్‌లింగంపల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాలకు ఇప్పటి వరకు ఏ మంత్రివర్గంలోనూ చోటు లభించకపోవడం గమనార్హం.

కల్వకుర్తి నియోజకవర్గం..

కల్వకుర్తి నియోజకవర్గానికి ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు నిర్వహించగా 11 మంది ఎమ్మెల్యేలుగా పనిచేశారు. కేంద్ర మాజీ మంత్రి, దివంగత సూదిని జైపాల్‌రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది ఈ నియోజకవర్గమే. 1969, 1972లో కాంగ్రెస్ నుంచి, 1978,1983లో జనతా పార్టీ నుంచి జైపాల్‌రెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మహబూబ్‌నగర్ నుంచి రెండుసార్లు, మిర్యాలగూడ నుంచి రెండు సార్లు ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రిగా పనిచేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్.. 1989లో ఇక్కడి నుంచి ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఎన్‌టీఆర్‌ను ఓడించిన చిత్తరంజన్‌దాస్‌కు చెన్నారెడ్డి మంత్రివర్గంలో చోటు లభించింది. ప్రస్తుతం కల్వకుర్తి నుంచి జైపాల్‌యాదవ్(బీఆర్‌ఎస్) ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

విశ్వశాంతి కోసమే యాగం

- శ్రీ కృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి



షాద్‌నగర్: విశ్వశాంతి కోసం అయుత చండీ అతిరుద్ర మహాయాగం నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి వెల్లడించారు. షాద్‌నగర్ పట్టణంలోని జడ్చర్ల రోడ్డులో శ్రీ బాలాజీ టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న స్థలంలో యాగం నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్వరూపానంద స్వామి మాట్లాడుతూ.. భూ మండలంపై జీవనం సాగిస్తున్న మానవులతో పాటు జీవరాశులన్నీ సుభిక్షంగా, సంతోషంగా జీవించాలనే ఉద్దేశంతో యాగం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 80 మహాయాగాలను నిర్వహించినట్లు తెలిపారు. షాద్‌నగర్‌లో 81వ మహాయాగాన్ని గురువారం ప్రారంభించి నవంబర్ 8వ తేదీన ముగించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతయాన్నారు.మహాయాగం కోసం మూడు యాగశాలలు, 648 జంటలు పాల్గొనేలా 216 షెడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 650 ఋత్విక్కులతో 14 రోజుల పాటు యాగాలు, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'కమలం' గూటికి రత్నం?

- రేపు కాషాయ తీర్థం పుచ్చుకోనున్న మాజీ ఎమ్మెల్యే
- చేవెళ్ల టికెట్ దాదాపు ఖరారైనట్లు సమాచారం



కేఎస్ రత్నం

చేవెళ్ల: చేవెళ్ల నియోజకవర్గంలో భారీ రాజకీయ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రధాన పార్టీల మధ్య పోటీ రసవత్తరంగా సాగే అవకాశం కనిపిస్తోంది. తాజాగా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం కమలం గూటికి చేరుతున్నారని, ఆయనకు చేవెళ్ల టికెట్ కూడా దాదాపు ఖరారైందని విశ్వసనీయ సమాచారం. ఈనెల 27న ఆయన బీజేపీలో చేరేందుకు ముహూర్తం పెట్టుకున్నట్లు తెలుస్తోంది. దీంతో బీజేపీకి సైతం ఇక్కడ బలమైన అభ్యర్థి దొరకినట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇన్నాళ్లు ఇక్కడ బీజేపీ నుంచి పోటీచేసిన వారిలో ప్రభావం చూపే నేతలు లేకపోవడంతో పరిస్థితుల్లో మార్పు కనిపించలేదు. మాజీ ఎమ్మెల్యేగా పనిచేసిన రత్నం నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడు కావడం, సొంత కేడర్ ఉండటంతో ఈసారి హోరాహోరీ పోరు తప్పదని ఓటర్లు సైతం పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాకు జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా చేసిన సేవలు బీజేపీకి కలిసొస్తాయని ఆ పార్టీ భావిస్తోంది. అధికార పార్టీలోనే కొనసాగుతున్న రత్నం తనకు టికెట్ రాకపోవడంతో స్వరం మార్చారు. పార్టీలోని తన మద్దతుదారులతో టికెట్ ఇవ్వాలని అధిష్టానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ సిట్టింగులకే సీట్లు ప్రాతిపదికన కాలె యాదయ్యకు మరోసారి అవకాశం ఇవ్వడంతో.. ఆయనను ఓడించి తీరుతామని బహిరంగంగానే ప్రకటించారు. బీఆర్‌ఎస్ టికెట్ రాకపోయినా తప్పకుండా పోటీలో ఉంటానని రత్నం మొదటి నుంచీ చెబుతున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి ఎలాంటి మద్దతు లభించకపోవడంతో బీజేపీవైపు మొగ్గు చూపించారు. ఈ పరిణామం బీఆర్‌ఎస్‌కు భారీ కుదుపులా పరిణమించనుందని తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన నేతలు ఆయనతోపాటే కండువా మార్చేస్తే గులాబీకి ఇబ్బంది తప్పదని పొలిటికల్ టాక్. ఇక్కడ త్రిముఖ పోటీ ఉంటుంది.

అట్టహాసంగా అలయ్ బలయ్

ఉట్టిపడిన తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు.. ఆకట్టుకున్న కళా, సాంస్కృతిక కార్యక్రమాలు.. ఒకటా .. రెండా.. 80 రకాలకు పైగా నోరూరించిన వంటకాలు.. ఒంటెలు, గొర్రెలు, గంగిరెద్దులు,దున్నపోతులు, బోనాల ప్రదర్శనలు ఆద్యంతం అలరించాయి. బుధవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ వేడుకలు అట్టహాసంగా సాగాయి. పలువురు రాజకీయ ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు.

– అబిడ్స్



ఆదివాసీ కళాకారులు..



దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి ఆత్మీయ ఆలింగనం



మహిళల నృత్య ప్రదర్శన



పంజాబీ కళాకారుల ప్రదర్శన



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్.





బోనాలతో శివసత్తులు, పోతరాజుల హంగామా, డోలు కొడుతున్న విజయలక్ష్మి, దత్తాత్రేయ



ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్..

కాంగ్రెస్‌తోనే సమన్యాయం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న వీర్లపల్లి శంకర్

- పార్టీ షాద్‌నగర్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్
- హస్తం గూటికి చేరిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

నందిగామ: రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని చేగూరుకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం శంకర్ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లయితే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని వివరించారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు చేసింది శూన్యమేనని విమర్శించారు. పార్టీలో చేరిన వారిలో నరేష్, భాస్కర్, కుమార్, అశోక్, శ్రీను, హరికృష్ణ, బీమయ్య, జంగయ్య,రమేష్, నవీన్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచనపల్లి అంజం గౌడ్,పసుల బుచ్చయ్య,కారటి నర్సింహా, మంకాల శ్రీశైలం, శివ, రాజశేఖర్, సుధాకర్, శంకర్, విజయ్, ప్రవీణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమిలో నిర్మాణాలు

నేలమట్టం చేసిన అధికారులు



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామకంఠం భూమిని కబ్జాచేసి ప్రీకాస్టుతో గదులు నిర్మిస్తుండగా అధికారులు అడ్డుకుని వాటిని నేలమట్టం చేశారు. వివరాలు.. ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడ రెవెన్యూ పరిధిలో డబుల్‌బెడ్రూం ఇళ్ల పక్కన ఉన్న గ్రామకంఠం భూమిలో నగరానికి చెందిన కొందరు వచ్చి ఈ భూమి మాది అంటూ ప్రీకాస్టు గోడలు పెడుతున్నారు. మున్సిపాలిటీకి చెందిన స్థానికులు ఈ విషయమై స్థానిక కమిషనర్, ఇబ్రహీంపట్నం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు గ్రామకంఠం భూమిలో అక్రమంగా నిర్మించిన గోడలను కూల్చివేశారు. అయితే ఇందులో ఎకరా 10 గుంటల భూమి తమదేనంటూ అక్రమార్కులు వాదించగా.. అధికారులు చెప్పిన సమాధానంతో చేసేదిలేక అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మేం ఓటెయ్యం

ఓటుహక్కు వినియోగంపై నిరాసక్తత

- ఉమ్మడి జిల్లాలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 13లక్షల మంది ఓటుకు దూరం
- ఈసారి ఈసీ ప్రయత్నాలు ఫలించేనా?

కొత్తూరు: ఓటు అనే రెండక్షరాలకు ప్రపంచ గతిని మార్చేశక్తి ఉంది. ఓటు.. వ్యక్తి యొక్క అస్తిత్వాన్ని గుర్తించడంతో పాటు వ్యవస్థ మార్పునకు నాంది పలుకుతుంది. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష ఆర్థిక భేదభావం లేకుండా దేశంలో నివసించే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు పొందే అవకాశం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్–326 కల్పిస్తుంది. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ద్వారా ప్రజలు కేంద్రం, రాష్ట్రాల్లో తమకు నచ్చిన ప్రభుత్వాలను ఎన్నుకునే అవకాశం ఉంది. ఇంతటి శక్తి ఉన్న ఓటును వినియోగించుకోవడంలో పలువురు నిరాశక్తత కనబర్చుతున్నారు. ఓటుహక్కు అవశ్యకతను.. దాని విలువను తెలియజేసేందుకు అధికారులు ఓటరు దినోత్సవం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ చాలామంది ఓటుహక్కును వినియోగించుకోవడం లేదు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ సరళి

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	ఓటుహక్కుకు దూరం
షాద్‌నగర్	189088	166527	22561
కల్వకుర్తి	204002	177914	26088
చేవెళ్ల	224230	177197	47033
శేరిలింగంపల్లి	575583	279805	295778
రాజేంద్రనగర్	441074	250934	190140
మహేశ్వరం	423261	234250	189011
ఎల్‌బీనగర్	493841	244841	249000
ఇబ్రహీంపట్నం	257711	196851	60860
పరిగి	229436	175371	54065
తాండూరు	201917	156436	45481
కొడంగల్	201941	165559	36382
వికారాబాద్	207222	153722	53500

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 12 నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 12,69,899 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోలేదు. అందులో అధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి సంబంధించి 2,95,778 మంది, ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి సంబంధించి 2,49,000 మంది ఓటుహక్కును వినియోగించకోలేదని లెక్కలు తెలుపుతున్నాయి. ఈ యేడాది వందశాతం పోలింగే లక్ష్యంగా ఎన్నికల కమిషన్, అధికారులు చెబుతున్నప్పటికీ ఓటర్లలో చైతన్యం రానంతవరకు అది సాధ్యమయ్యే పనికాదని విమర్శకులు వాదిస్తున్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ దేవకి, సిబ్బంది

- ఎస్ఐ దేవకి
- రాయికల్ టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు

షాద్‌నగర్ రూరల్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి అక్రమంగా మద్యం, డబ్బును తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ దేవకి హెచ్చరించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దేవకి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చెక్ పోస్టుల వద్ద 24 గంటలు వాహనాల తనిఖీ కొనసాగుతోందన్నారు. చెక్‌పోస్టు మీదుగా వెళుతున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం, డబ్బువంటి వాటిని తరలించే వాహనాలపై నిఘాను పటిష్టంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, బంగారం, వెండి, పేలుడు పదార్థాలు, మారణాయుధాలు వంటి వస్తువులను రవాణా చేయడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిత్యం వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేపడుతామని తెలిపారు. రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్తే సీజ్ చేస్తామని, తనిఖీల్లో పట్టుబడిన వాటికి సరైన ఆధారాలను చూపించాలని సూచించారు.

రూ.6.50 లక్షల నగదు పట్టివేత

చేవెళ్ల: ఎన్నికల కోడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద రూ.6.50లక్షల నగదు పట్టుబడింది. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు.. చేవెళ్ల మండలంలోని అంతారం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా.. వికారాబాద్ వైపు నుంచి చేవెళ్ల వైపు వస్తున్న ఓ కారులో రూ.6.50లక్షల నగదు లభించింది. వారి వద్ద ఆ నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకపోవటంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: మొయినాబాద్ పీఎస్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం పోలీసులు, స్పెషల్ టీమ్ సభ్యులు చేపట్టిన తనిఖీల్లో రూ.2లక్షల నగదు పట్టుబడింది. మొయినాబాద్ ఎక్స్‌రోడ్డులో ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు అతని వద్ద తనిఖీ చేయగా రూ.2లక్షల నగదు లభించింది. నగదుకు సంబంధి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో సీజ్‌చేసి జిల్లా గ్రీవియన్స్ కమిటీకి అప్పగించారు.

నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు



వాహనానికి సీల్ వేస్తున్న అధికారి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను బుధవారం రాజేంద్రనగర్ ఈవీఎం గోడౌన్ నుంచి ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలకు తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరీ, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ వీటిని తరలించారు. రాండమైజేషన్ జాబితాను అనుసరిస్తూ కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లను సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు అప్పగించగా, పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనాల్లో తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ఎన్నికల సంఘం సూచనలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఈవీఎంలను తరలించారు. ఈ ప్రక్రియలో సంబంధిత అధికారులుపాల్గొన్నారు.

ఎదురెదురుగా లారీలు ఢీ



సాగర్ రోడ్డు తమ్మలోనిగూడ గేట్ సమీపంలో ఢీకొన్న రెండు లారీలు

ఇద్దరు డ్రైవర్ల దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- సాగర్– హైదరాబాద్ రహదారిపై ఘటన

యాచారం: నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై బుధవారం రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. యాచారం సీఐ సైదయ్య తెలిపిన వివరాలు.. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా, చించోళి మండలం, చిమ్మిఇదిలై గ్రామానికి చెందిన నిలడాకర్ దత్తు(21) పత్తి లారీతో సాగర్ రోడ్డు నుంచి మాచర్ల వైపు వెళ్తున్నాడు. హర్యానాకు చెందిన ఆజాద్(28) గ్రానైట్‌లోడ్‌తో మాచర్ల నుంచి హైదరాబాద్ వస్తున్నాడు. మార్గమధ్యలో తమ్మలోనిగూడ గేట్ సమీపం వద్ద బుధవారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రెండు లారీల ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్లు దత్తు, ఆజాద్ తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందారు. అదే విధంగా లారీల్లో ఉన్న మరో ఇద్దరు ఆసిఫ్, రాహుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంతో సాగర్‌రోడ్డుపై గంట పాటు ట్రాఫిక్‌జాం ఏర్పడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.

గుండెపోటుతో ట్రాఫిక్ కానిస్టేబుల్ మృతి



సురేష్ (ఫైల్)

మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మదలంగి సురేష్ (50) వాకింగ్ చేస్తుండగా గుండెపోటుతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాకు చెందిన సురేష్ 2000 సంవత్సరం బ్యాచ్ కానిస్టేబుల్. నగరంలోని సంతోష్‌నగర్ ఈస్ట్‌మారుతినగర్‌లో ఉంటున్నారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు వాకింగ్ చేస్తున్న సురేష్ ఒక్కసారిగా కింద పడిపోయాడు. తోటి వాకర్స్ వెంటనే కంచన్‌బాగ్ డీఆర్‌డీఓ అపోలో ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కోవిడ్ నుంచి ఆయన రెండుసార్లు కోలుకున్నారు. విషయం తెలుసుకున్న సౌత్‌ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్ ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

■బ్యాంక్,ప్రైవేట్ సంస్థలలోతాకట్టుపెట్టిన బంగారంను మా డబ్బుతో విడిపించి ఇతర సంస్థలలో తక్కువ(83పైసలు)వడ్డీకి,ఎక్కువగ్రాము (4500) రేటుకు తాకట్టు పెట్టించబడును.8977044454. [T-764155]

BUSINESS SERVICE

■మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788377]

BUSINESS OFFER

■ఇంటి నుండి 100 రకాల ఉత్పత్తులతో రోజు సంపాదన. LED's, TV's, AC's, Mobiles కొత్తవి కొన/అమ్మబడును. EMI, Credit Cardలో బ్యాలెన్స్ ఉన్నవారికి Spot పర్సనల్/ బిజినెస్ ఫైనాన్స్ సలహాలకై సంప్ర: 9100729447 [HA-3414]

FOR SALE

■Country Chicken Broiler 2000 Nos for Sale Reasonable Rates at Shamirpet Contact : 9908299134. [HA-5685]

HOME NEEDS

PEST CONTROL

■వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్ 5 సం॥ వ్యారంటీతో చెదలు (బొద్దింకలు, నల్లులు, బల్లులు) నివారించే సంస్థ, హిందుస్థాన్ పెస్ట్ కంట్రోల్. సంప్ర : 7981533849, 9490179238. [HA-732]

PERSONAL CARE

CHANGE OF NAME

■I, PRASANNA REDDY THATHI, R/o Plot. No. 66/A, Rameshwar Nagar, Jonnabanda, Alwal, Hyderabad-500010, Changed My Minor Daughter Name T.PRATIMA REDDY to "PRATIMA REDDY THATHI" [HA-14009]

■I, Vandana Shukla, W/o Manish Shekher, R/o Secunderabad have Changed my name to Vandana Shekher Shukla for all purposes. [HA-6399]

■I, BADULLABI SHAIK R/O 1-11-110/3 1st Floor, Talachary Colony, Syamlal Buildings, Begumpet, Hyderabad 500016 have changed my name to NAZEEYA BADHUL BI SHAIK W/o. NAGUR SAHEB SHAIK affidavit dated 8/5/2014 notary by K.V.P. Madhava Rao [DA-9204]

■I, Kolla Janakiram Rajanaidu Jyothi Ram S/o, Janakiram Raja Naidu Kolla R/o Villa 59, Sark Two, Mokila, Shankarpally, K.V. Ranga Reddy, Telangana - 501203 have changed my name to Jyothiram Janakiramrajanaidu Kolla. [DA-29829]

OLD AGE HOME

■ఒమేగా హోంకేర్. వంట/ఇంటిపని చేయుటకు వృద్ధులను పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం. చూసుకొనుటకు మీ ఇంటికి కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. ఫోన్ : 8977639664, 8977639665 [H-189345]

Wanted

■ప్రముఖ ఆఫీస్‌లో పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్, లేడీ రిసెప్షనిస్ట్ అర్జెంటుగా కావలెను. మంచి జీతం+కమీషన్, వయస్సు:18 to 25. Ph: 8074013164 [H-788838]

■షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వంట మనుషులు, వార్డ్ బాయ్స్, ఆయాలు, భార్యాభర్తలు, గార్డెన్ పని & ఆవులు చూసుకొనుటకు వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246685901 [HA-12454]

■ప్రముఖ రియల్ ఎస్టేట్ కం., మార్కెటింగ్ చేయుటకు రిటైర్డ్ ఉద్యోగులు, గృహిణులు, ఇన్సూరెన్సు ఏజెంట్స్ అన్ని కేటగిరీస్. మంచి కమీషన్. ఉచిత శిక్షణ & సపోర్ట్. Ph: 7036332956 [HA-95351]

FACULTY TEACHERS

■Wanted to Teach Hindi (Exp) 6th to 10th, F/P Time Vanasthalipuram Surrounding area. Contact immediately. Ph: 7702082198, 9440036918. [HA-3323]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-

గమనిక : జిఎస్టి మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

పార్టీ చేవెళ్ల అభ్యర్థి భీంభరత్

చేవెళ్ల: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. చేవెళ్లలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని.. ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ వెంట నడిచేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈనెలరోజులుపార్టీ కోసం పనిచేస్తే పార్టీ మనకోసం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల సర్పంచ్ శైలజ, మహిళా అధ్యక్షురాలు సమత, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మదుసుధన్‌గుప్తా, శ్రీనివాస్, పాండు, ప్రభాకర్, పెంటయ్యగౌడ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న భీంభరత్

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మాడ్గులలో బీజేపీ శ్రేణుల బైక్‌ర్యాలీ

కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి

మాడ్గుల: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి తల్లోజు ఆచారి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బీజేపీ శ్రేణులతో కలసి ఆయన మాడ్గులలో బైక్‌ర్యాలీ, ఇంటింటి ప్రచారం నిర్వాహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ బీజేపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న బీఆర్ఎస్, దేశాన్ని నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని కోరారు. అనంతరం మండల పరిధిలోని కొర్ర తండా, కట్రావత్ తండా గ్రామ పంచాయతీకి చెందిన దాదాపు 100 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వేంకటేష్, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు జగన్, సర్పంచ్ నిరంజన్, తాలుకా కోకన్వీనర్ గోరెటి నర్సింహ, ఉప సర్పంచ్ శ్రీశైలం, మాడ్గుల మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్, నాయకులు సత్యనారయణ, జంగయ్య, వేంకటేష్, శ్రీను, రఘుపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం!

- తనిఖీలతో హడావుడి చేస్తున్న పోలీసులు
- ఇద్దరు వ్యాపారుల వద్ద రూ.50,200 నగదు
- రామాయంపేట చెక్‌పోస్టు వద్ద గుర్తించిన ఎస్ఐ
- ఒకరి వద్దే పట్టుబడినట్లు పంచనామా, సీజ్
- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే సీన్‌తో సామాన్యుల గగ్గోలు



సాక్షి, సిటీబ్యూరో: మోరల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పేరు చెప్పి పోలీసులు సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. ఎక్కడికక్కడ తనిఖీల పేరుతో దొరికిన నగదు దొరికినట్లు సీజ్ చేస్తున్నారు. ఇదంతా ఎన్నికల్లో ఖర్చులకు ఉద్దేశించిందే అన్నట్లు హడావుడి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తీరు కనిపిస్తోంది. బుధవారం రామాయంపేట చెక్‌పోస్టు వద్ద పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల సంఘానికి లెక్కలు చూపించడం కోసమే అన్నట్లు ఈ పోలీసులు విచక్షణ మరచి వ్యవహరించారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువకులు కామారెడ్డిలో లాజిస్టిక్స్ కంపెనీ నిర్వహిస్తున్నారు. తమ వ్యాపార కార్యకలాపాల కోసం వెళ్లిన వీళ్లు బుధవారం కారులో తిరిగి వస్తున్నారు. అందులో ఉన్న బ్యాగులో రూ.50 వేలు (రూ.500 నోట్ల కట్ట) ఉంది. రామాయంపేట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసిన పోలీసులు ఈ కారు ఆపారు. బ్యాగ్ తనిఖీ చేసిన ఎస్ఐ నేతృత్వంలోని పోలీసులు అందులో రూ.50 వేలు ఉండటం గమనించారు. నిబంధనల ప్రకారం ఓ వ్యక్తి రూ.50 వేల వరకు నగదు ఎలాంటి రసీదులు లేకుండా తీసుకువెళ్లే అవకాశం ఉంది. అయినప్పటికీ చెక్‌పోస్టులోని పోలీసులు యువకులను ఆ నగదుకు లెక్కలు చెప్పమని గద్దించారు. అవి తమ వ్యాపారానికి సంబంధించినవి అని చెప్తున్నా వినిపించుకోలేదు. రూ.50 వేలు సీజ్ చేసే అవకాశం లేకపోవడంతో ఆ పోలీసులు 'ప్రత్యామ్నాయ మార్గాలు' అన్వేషించారు. ఆ యువకుల జేబుల్లో, పర్సులు తనిఖీ చేశారు. ఒకరి పర్సులో రూ.200 ఉండటంతో ఆ మొత్తంతో కలిపి తాము రూ.50,200 సీజ్ చేసినట్లు, అవి ఒకరి వద్దే లభించినట్లు పంచనామా సిద్ధం చేశారు. ఇందులో ఇద్దరి పేర్లు ప్రస్తావించకుండా ఒకరి పేరు రాసి ఆ మొత్తం స్వాధీనం చేసుకున్నారు. రూ.50 వేలకు మించిన నగదు ఒకరి వద్ద ఉంటే సీజ్ చేస్తారా? లేక ఒక వాహనంలో ఉంటే సీజ్ చేస్తారా? దానికి సంబంధించి ఈసీ ఆదేశాలు చూపాలంటూ యువకులు కోరినా పోలీసులు పట్టించుకోలేదు. ఆ ఉత్తర్వులు చూపాలంటే ముందు పేరు చెప్పాలంటూ తెలుసుకుని పంచనామాపై రాశారు. రామాయంపేట పోలీసుల తీరుపై యువకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేవలం తమ లెక్కల కోసం ఇలా సామాన్యులను ఇబ్బంది పెట్టడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. గడిచిన కొన్ని రోజులుగా రాష్ట్రం మొత్తం ఇలాంటి సీన్లే కనిపిస్తున్నాయి. కోడ్ పేరుతో పోలీసుల చూపిస్తున్న అత్యుత్సాహం సామాన్యులకు ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా నగదు సీజ్ చేశారు. హైదరాబాద్‌లోనే ఈ మొత్తం రూ.15 కోట్ల వరకు ఉంది. బోయిన్‌పల్లి పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్న రూ.55,900 నగదుతో మాత్రమే ఎన్నికల లింకులు ప్రాథమికంగా బయటపడ్డాయి. ఈ నగదు తరలిస్తున్న న్యూ బోయిన్‌పల్లి వాసి ఎం.భాస్కర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కావడంతో ఆ కోణంలో 'ఎలక్షన్ డబ్బు'గా అనుమానిస్తూ స్వాధీనం చేసుకున్నారు. ఇది మినహా మరే ఇతర ఉదంతంలోనూ నగదు స్వాధీనంలో రాజకీయ కోణం బయటపడకపోవడం గమనార్హం.